# సాక్షాత్కారం

శంకరమంటే నాకు ఒళ్ళుమంట. అతణ్ణి నేను ఎగతాళి పట్టించాలను కున్నాను. ఎద్దేవా చేయ్యాలనుకున్నాను. పదిమందిలోను అతని నిష్ప్రయోజక త్వాన్ని బయటపెట్టి, లోకులందరూ అతణ్ణి చూచి నవ్వుతుంటే వాళ్ళతోబాటు గొంతు కలపాలనుకున్నాను. కానీ అతణ్ణి గురించి యిలా కథ వ్రాయవలసి వస్తుం దని మాత్రం అనుకోలేదు.

ఒక వ్యక్తిపట్ల మనకెందుకు అయిష్టం కలుగుతుందో చెప్పలేము. కార ణాలు చిన్నవే గావచ్చు. ఆ స్వల్ప కారణాలు గూడా మనల్ని బాధించేవి గాక పోవచ్చు. కానీ ఎందుచేతనో క్రమక్రమంగా మనసు అతణ్ణి కంటగించుకునే స్థితికి వచ్చేస్తుంది. శంకరం విషయంలో యిదే జరిగింది.

నువ్వొక మనిషిని నవ్వించడానికి ప్రయత్నిస్తావు రకరకాలు చేష్టలు ప్రదర్శిస్తావు. బోలెడన్ని జోకులు తెచ్చి అతని తలపైన దిమ్మరిస్తావు. మాటలతో లాభంలేదని తెలిపోయిన తర్వాత, ఇక చేతలకు పూనుకోక తప్పదని చక్కిలి గింతలు గూడా పెట్టి చూస్తావు. ఎంత చేసినా అతను నవ్వనే నవ్వడు. నువ్వే మనుకుంటావు? అతణ్ని రాయనుకుంటావు. రప్పనుకుంటావు నవ్వించే మాట కాదుగానీ, నేనుగూడా శంకరాన్ని రాయనే అనుకున్నాను.రప్పనే అనుకున్నాను.

నేనే గాదు, నాతోటి గుమస్తాలందరూ గూడా యిదే నిర్ణయానికి వచ్చేశారు.

"ఏమిటోయ్ రాజశేఖరం! ఈ రోజు శిలావిగ్రహంగాదేమైనా సెలవు పెట్టి నట్టా?" ఎంతో ఆశగా ఆనందరావు.

"ఏదీ, పది గంటలకింకా పది నిముషాలుంది గదా!" అనేవాణ్ని నేను'

జ్వరం, గిరం ఏదైనా వచ్చి శంకరం పదిరోజులు సెలవు పెడితే, ఆ వ్యవధిలో అతడు చర్య తీసుకోవలసిన ఫైళ్ళు ఎత్తు పెరిగితే, వాటిని సకాలంలో పరిష్కరించలేని స్థితిలోనైనా అతడు ఆఫీసరుగారి దగ్గర చీవాట్లు తినకపోడుగదా, అన్నది ఆనందరావు ఆశాభావం.

ఈ ఆశ గతంలో వెయ్యిసార్లు ఫలించలేదు. భవిష్యత్తులో వెయిసార్లు ఫలించదు. ఈ సంగతి మాకు రూఢిగా తెలుసు.

గోడ గడియారం గొంతు విప్పి ఠంగు ఠంగున పదోగంట కొట్టి ముగించే సరికి అంత వేగంగాను గాక, మరీ అంత నెమ్మదిగానూ గాక కంప్యూటర్ మర బొమ్మలా క్రమబద్ధంగా అడుగులు వేసుకుంటూ వచ్చి శంకరం తన కుర్చీలో తాను ఆసీనుడైపోవడం ఖాయం.

సూర్యచంద్రులు గతులు తప్పినా సరే, శంకరం టంచనుగా పదింటికి ఆఫీసు కొస్తాడు. బయట ఒడివాన కురుస్తున్నా సరే, నికరంగా అయిదింటికే ఆఫీసునుంచి నిష్క్రమిస్తాడు. ఈ మధ్యన అరగంట లంచ్ టైమ్‌లో మాత్రం తానెంతో పదిలంగా చేతి సంచిలో వేసి తెచ్చుకున్న టిఫిన్ బాక్స్‌ను ఖాళీ చేయడం కోసం ఆఫీసు కట్టడానికి వెనుక వైపున వున్న వేపచెట్టు క్రిందికి వెళ్తాడు. ఈ ఇలాతలంపైన ఆ టిఫిన్ బాక్స్‌లో ఏముంటుందో తెలిసిన వాళ్ళు ముగ్గురంటే ముగ్గురు. ఒకరేమో ఆఖాద్య పదార్థాన్ని తయారు చేసిన ఇల్లాలు. రెండో వ్యక్తి ఎవరికోసమైతే ఆ పదార్థం తయారు చేయబడిందో ఆ శంకరం. మూడోవాడు సర్వాంతర్యామి అయిన భగవంతుడు.

ప్రతి నెలకూ శుక్లపక్షమనీ, కృష్ణ పక్షమనీ వున్నట్టుగా శంకరానికి ప్రతి పక్షంలోను ఊదావారమనీ, బూడిద వారమనీ రెండు వారాలు. మరేంలేదు. అతడు ధరించే ఫాంటు రంగును బట్టి యిలా పేర్లు పెట్టుకోవడం జరిగింది. శంకరం మా ఆఫీసులో ఉద్యోగం చేసిన కాలం నాలుగేళ్ళు. ఈ నాలుగేళ్ళ కాలములో ఏ సమయంలోనైనా అతనికి ముచ్చటగా మూడు ఫాంట్లున్నట్టు నాకు గుర్తు లేదు. వున్న రెండింటిలో ఒకటి చిరుగులు పడిపోయి, పూర్తిగా ఉపయోగార్హత కోల్పోయినప్పుడు మాత్రమే అతడు కొత్త ఫాంటు కుట్టించుకునేవాడు.

"అకౌంటుపైన బట్టలు అప్పుగా యిచ్చే అంగళ్ళు కూడా వున్నాయి. శంకరం! ఒకసారిగా నాలుగు ఫాంట్లు కుట్టించుకోరాదూ?" అంటూ సలహా యిచ్చి చూశాను.

నా అమాయకత్వానికి జాలిపడుతున్నట్టుగా నవ్వేసాడు శంకరం. "ఎందుకు లెండి శేఖరంగారూ! ఇదే హాయిగా వుంది. నాకిప్పుడు చాకలివాళ్ళతో బెడద లేదు.

లేదంటే ప్రతి ఆదివారమూ యిందుకోసమని కొంత కాలం వినియోగించాలి. ఓ ఫాంటు, షర్టూ వుతికి ఆరవేసుకుంటానేమో, ఇస్త్రీ చేసి పెట్టెలో పెట్టుకుంటానేమో! ఇందువల్ల ఎల్లప్పుడూ నా పెట్టెలో ఒక జత బట్టలు స్టాకుండిపోతాయన్నమాట! అంతకంటే ఏం కావాలి చెప్పండి!"

లోభత్వాన్ని కూడా అదొక వైభోగంలా చెప్పుకోడానికి వీలుంటుందని నా కప్పుడే మొదటిసారిగా తెలిసింది.

అయినా ఆమాత్రంతో నేను ఆశ వదులుకోలేదు. శంకరాన్ని మెల్లగా మా దారిలోకి మళ్ళించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలైతే చేయవచ్చో అన్నింటినీ చేసి చూసాను. మహర్షులకు తపోభంగం కలిగించటానికి ఇంద్రుడు కూడా అన్ని పాట్లు పడివుండడు. సిగరెట్లు ఆఫర్ చేశాను. తేనీటి సేవనం మప్పాలను కున్నాను. ఆఫీసు కాంటీనుకు అలవాటు చేద్దామని ప్రయత్నించాను. ఆఖరుకు 'ప్రపంచమనే ఎడారిలో ఒయాసిస్సుల్లాంటి సినిమా థియేటర్లున్నాయి శంకరం! రెండు రూపాయలు మనవి కావనుకుంటే మూడు గంటలసేపు వినోద కాలక్షేపం' అంటూ సదుపదేశం చేశాను. మహానుభావుడు శంకరం చెక్కు చెదిరేటట్టులేడు!

"మన్నించండి శేఖరంగారూ! మీకిష్టమైన వ్యాసంగాలే నాకూ యిష్టం కావాలని ఎక్కడుంది? నా కానందం కలిగించేవి వేరే వున్నాయిలేండి !" అనే వాడు.

ఈ మాట కాస్తా మా ఆనందరావు చెవిలో వేశానమో, అతడు విరగబడి నవ్వేశాడు:— "వాడి కానందమైన వ్యాసంగా లేమిటో నేను చెప్పనా శేఖరం! ఒకటి, జీవచ్ఛవంలా బ్రతకడం. రెండోది, నడపీనుగులా మసలుకోడం! ఇంతకూ వాడు తాను బ్రతుకుతున్నది గూడా ఒక బ్రతుకేనని అనుకుంటున్నాడా శేఖరం! ఎంత ఆశ్చర్యం, ఎంత ఆశ్చర్యం!" అంటూ విస్తుపోయాడు.

రా సి ఊరికి వచ్చి ఉద్యోగంలో చేరిన క్రొత్తలో ఒకనాటి సాయంకాలం శంకరం నాకొక మారుమూల వీధిలో ఎదురయ్యాడు. ఆఫీసులో ఎప్పుడైనా ముక్తసరిగా పలకరించుకోడమే గానీ నా కప్పటివరకూ శంకరంతో పెద్దగా పరిచయం లేదు. ఇలా తిరుగుతున్నావేమయ్యా శంకరం ! ఇక్కడెవరైనా తెలిసినవాళ్ళున్నారా?" అని ప్రశ్నించాను.

"అబ్బే, అదేం లేదండీ! కాపురం తెచ్చుకోవాలి గదా! అద్దె యింటికోసం వెదుకుతున్నాను" అన్నాడు శంకరం.

నా చితిని నేనే పేర్చుకున్నాను-అన్నారట మహానుభావు డెవడో! ఆ క్షణాన శంకరాన్ని చూస్తుంటే నాకు ఆ మాటే జ్ఞప్తికి వచ్చింది.

"కాదయ్యా శంకరం! ఈ వూరిలోనే పుట్టి పెరిగి, యిక్కడే ఉద్యోగం చేస్తున్న నాబోటి వాళ్ళం ఆఫీసులో వున్నాము గదా! మాలో ఎవరికి చెప్పినా ఈ పాటికి నీకో అద్దె యిల్లు చూపెట్టి వుండమా? ఆ సులభోపాయం వదిలి పెట్టి నీ అంతట నువ్వే కాళ్ళరిగి పోయేటట్టు తిరుగుతానంటావా? చోద్యంగానే వుంది లేవయ్యా నీ వాలకం" అంటూ ఓ దులుపు దులిపేశాను.

"అయ్యో, మీరు చూపెట్టరని కాదండీ!" నొచ్చుకున్నట్టుగా సంజాయిషీ ప్రారంభించాడు శంకరం. "ఎలాంటి పరిసరాల్లో, ఏ మాత్రం అద్దె రేటుతో నా కిల్లు కావల్సి వచ్చేది మీకేం తెలుసు చెప్పండి! కొంచెం ఆలస్యమైనా నాకు తగిన యిల్లు నేనే వెదుక్కోడం మంచిది కాదంటారా?"

బహుశా నేను తెల్లబోయి వుంటాను. ఇతగా డిప్పుడిప్పుడే మనకు అర్థ మయ్యే ఘటంలా లేదని కూడా నాకు అనిపించి వుండొచ్చు. అయినా పోనీ లెమ్మని నా ఎరుకలో వున్న వర్తమానాన్ని బయటపెట్టేశాను.

"చూడు శంకరం! మన ఆఫీసులో భానుమూర్తి లేడూ, ఈ మధ్య అతనికి యిల్లు కావలసి వచ్చి వాకబు చేస్తుండగా తెలిసింది. మా వీధిలోనే రెండిళ్ళు ఖాళీగా వున్నాయి. ఒంటేమో పెంకుటిల్లు. అది మా యింటికి నాలుగో యిల్లే. వీధివైపున వసారా, వెనక రెండో మూడో గదులూ, చేదబావీ, పెరడూ సదుపాయాలన్నీ వున్నాయి. ఇంకొకటి—అబ్బే, దాన్ని యిల్లనుకోడానికి వీల్లేదు. ఓ పెద్ద యింట్లో పెరటివైపున అవుట్‌హవుస్ లాంటి వాటా. ఆ యింట్లో ఖాళీ జాగా కన్నా గోడలే ఎక్కువ స్థలం ఆక్రమించాయేమోనని నా అనుమానం. ముద్దుగా దాన్ని అగ్గి పెట్టెల మేడ అంటుంటాం. ఎవరో చిన్న తరహా ఉద్యోగులు తమ పెళ్ళాం బిడ్డ లతో ఆ గదులనిండా క్రిక్కిరిసి వున్నారు. ఏది నీ కిష్టమైతే దాన్నే సెలక్ట్ చేసు కోవచ్చు. అవసరమైతే వచ్చి చూసుకో బాబూ!" అని నా పాటుకు నేను నా పని పైన వెళ్ళిపోయాను.

రెండు రోజుల తర్వాత మూడోనాటి ఉదయం శంకరం ఆఫీసులోనే నన్ను సంధించి కృతజ్ఞత చెప్పుకున్నాడు.

ఇల్లు కుదిర్చి పెట్టడంలో సైతం నా సహాయం ఆపేక్షించని అతడి ధోరణికి ఆశ్చర్య పడిపోతూ "ఏ యిల్లు?" అన్నాను.

"అదేనండీ! అగ్గిపెట్టెల మేడలో వెనకవైపు వాటా."

"అయ్యో శంకరం! అంతకంటే నీ కాపురాన్ని తీసుకెళ్ళి కూరగాయల మార్కెట్లో పెట్టలేక పోయావా?" అంటూ చీదరించుకున్నాను.

"ఫరవాలేదు లెండి! వీధిలో నుండి వేరే సందు దారి వుంది. ఆ యింటితో మనకేమీ సంబంధం వుండదు."

ఉండకపోవచ్చు. ఎందుకంటే నాలుగు వరుసలలో దాదాపు నలభైమంది గుమాస్తాలు కూర్చుని పనిచేసుకునే హాల్లోనే అతడు ఇంకొకరితో సంబంధం లేకుండా వ్యవహరింప గలుగుతున్నాడు. అగ్గిపెట్టెల మేడలోనైనా సర్దుకోక పోడు.

కానీ ఆతడు ఎంతగా లోకంతో అంటీ ముట్టకుండా వ్యవహరింప జూచినా ఈ మనుషులు మాత్రం అతణ్ణి సులభంగా వదిలిపెట్టేటట్టు లేరు. ఎక్కడిదాకానో ఎందుకూ, ఆ ప్రయత్నం మా ఇంట్లోనే ప్రారంభమైంది.

"ఏమండీ! మీ తోటి గుమాస్తా ఎవరో మన వీధిలోనే చేరాడన్నారు గదూ! వాళ్ళావిడి నొకసారి తీసుకొచ్చి నాతో పరిచయం చేసి పెట్టగూడదూ?" అంటూ ప్రారంభించింది రాజేశ్వరి.

"బాగానే వుందిలే రాజేశ్వరి! మేమింకా ఒక పాత్రను అర్థం చేసుకోడమే పూర్తి కాలేదు. అంతలో యింకొక పాత్ర గూడానా?" అన్నాను.

అప్పటికైతే ఫుల్‌స్టాప్ పెట్టేశాను గానీ ఆ ప్రసక్తి మళ్ళీ పొడ చూపే అవకాశం లేకపోలేదని నేను కొద్ది రోజుల్లోనే గ్రహించాను. మా పాప పుట్టినరోజు పండుగ 'సెలబ్రేట్' ఏర్పాట్లను గురించి చర్చించుకుంటూ వుండగా వున్నట్టుండి మా ఆవిడ ఆ ప్రస్తావన తీసుకొచ్చేసింది.

"ఏ వూరో, ఏ పల్లో, ఏ తల్లికన్న బిడ్డో ఆవిడకు మాత్రం ఎలా ప్రొద్దు పోతుందండీ? ఎక్కడికైనా వెళ్ళాలనీ, ఎవరితోనైనా పరిచయాలు పెట్టుకోవాలనీ

వుండదూ? ఆ దిక్కుమాలిన శంకరం మాటకేంలెండి తాను రాకపోతే మానె, భార్యనైనా పంపించమనండి..."

ఆ మరునాడంతా నాకు ఆఫీసులో తోటి గుమాస్తాలను ఆహ్వానించడంతోనే సరిపోయింది. కానీ అదెందుకో శంకరం దగ్గరికి వచ్చేసరికి ఏదో పొరపాటు చేస్తున్నట్టు ఫీలవుతూ, ఎప్పటి కప్పుడు అతణ్ని పిలవడం వాయిదా వేసుకుంటూ వచ్చాను. గంట అయిదు కొట్టగానే అతడు లేచి వెళ్ళిపోతుండడం గమనించి వసారాదాకా వెన్నంటి వెళ్ళి "మిస్టర్ శంకరం! మాట..." అన్నాను.

"ఏమిటండీ?" తిరిగి చూస్తూ నింపాదిగా అడిగాడు శంకరం.

"మా యింట్లో రేపొక చిన్న విశేషం. పాపాయి పుట్టినరోజు పండుగ చేసుకుంటున్నాం ప్రధానంగా అది ఆడవాళ్ళ ముచ్చట. అందరూ వచ్చినా సరే! అలా కుదరకపోతే మీ ఆవిడనైనా తప్పక పంపించాలి..."

ఏదైనా కుంటిసాకుతో అతడు తప్పించుకో జూస్తాడేమోనని అనుమానం నాకు లేకపోలేదు. అందుకని చెప్పి ముగించడమే తరువాయిగా వెనుదిరిగి వడివడిగా ఆఫీసులోకి వెళ్ళిపోయాను.

మరునాడు నేను ఆఫీసుకు సెలవు పెట్టి యింటిపట్టునే వుండిపోయాను.

బిడ్డకు హారతెత్తి, ఉపాహారాలు సేవించి, ముత్తయిదువులందరూ వెళ్ళిపోయాక మా ఆవిడ ఫిర్యాదు మొదలెట్టింది—

"ఏమండీ, చూసారా! పిలిచిన వాళ్ళందరూ వచ్చారు గానీ, ఆ శంకరం గారి పెళ్ళాం మట్టుకు రానేలేదు..."

"వస్తే ఎంత, రాకపోతే ఎంత! తానొక ఒంటికాకిలా బ్రతుకుతున్నాడా, మరింక పెళ్ళాన్ని పిరి ఘోషాలో వుంచేసాడేమో!"— నాకు శంకరంపైన పీకలదాకా కోపమొచ్చింది.

ఎట్టి పరిస్థితులలోనూ శంకరానికి సంజాయిషీ చెప్పుకునే అవకాశం దక్కకుండా చేయాలన్నది నా ఉద్దేశం. సూటిగా నా ఉద్దేశంపైన దెబ్బతీస్తూ అతడు నేరుగా నాబల్ల దగ్గరికి వచ్చి ఎట్లయెదుట నిటారుగా నిలబడిపోయాడు.కొద్ది క్షణాల పాటు వేచి చూచిన తర్వాత మెల్లగా గొంతు సవరించుకుంటూ "మన్నించండి శేఖరంగారూ! మొన్నటి సాయంకాలమే మీతో చెప్పాలనుకున్నాను... దయచేసి వేరు విధంగా భావించవద్దు......" అంటూ గింజుకున్నాడు.

నే నతడి ఉనికినైనా గమనించని పాపాన పోకపోయేసరికి ఒకటి రెండు నిమిషాలదాకా అలాగే నిల్చుని "సర్లెండి! మీకేదో తొందర పనిమీద వున్నట్టు న్నారు. మళ్ళీ ఎప్పుడైనా చెబుతాను లెండి..." అంటూ తన సీటువైపు సాగి పోయాడు.

తనతో ముఖమిచ్చి మాట్లాడానికైనా నాకు మనస్కరించడంలేదన్న విష యం శంకరానికి అవగతమయ్యే వుంటుంది. నేనేగాదు, తోడి గుమాస్తాలందరూ అతని నొక క్షుద్ర కీటకంగా లెక్కకడుతున్నారన్న విషయాన్ని కూడా గుర్తించే వుంటాడు. అయినా లోకులతో మనకెందుకు లెమ్మన్న అతని ఉదాసీన భావాన్ని గమనిస్తూ నేను కుతకుతలాడి పోయేవాణ్ణి, ఇతనిన్నెలాగైనా రచ్చకీ డ్వాలి, అవమానించాలి, అపహాస్యానికి గురి చెయ్యాలి. ఎలాగబ్బా? అందుకేది దారి? నకిలీ ట్రాన్స్ఫర్ ఆర్డరొకటి టైప్ చేయించి పోస్ట్లో వేయిస్తే? జవానుతో చెప్పి కాలిజోళ్ళలో ఒకటి మటుమాయం చేయిస్తే? 'మదర్ సీరియస్' అంటూ ఒక టెలిగ్రాం యిప్పిస్తే?—

శంకరంపైన యిలా కార్టూన్లు గీసుకోవడమూ,బఫూన్‌లా చిత్రించుకోడమూ కూడా నా మానసిక ప్రపంచంలో నిరాఘాటంగా జరిగిపోతున్న సమయంలో హఠాత్తుగా అతణ్ణి గురించి పునరాలోచించుకోవలసిన అగత్యం ఏర్పడింది. ఇందుకు కారకు లెవరో గాదు— మా ఆవిడ రాజేశ్వరి !

దళవాయి వీధిలో వున్న మా బంధువుల యింటికి వెళ్ళి తిరిగొస్తూ వున్న రాజేశ్వరికి దారిలో అగ్గిపెట్టెల మేడ దగ్గరి కొచ్చేసరికి శంకరం యింటికి వెళ్ళి, అతని భార్య ఎలా వుంటుందో చూసిరావా లనిపించిందట ! మగవాడి దౌష్ట్యానికి గురైన ఆడవాళ్ళమీద రాజేశ్వరికొన్న సానుభూతి అపారమని చెబితే అది నా భార్యను నేను పొగుడుకుంన్నట్టు గాదు, యదార్థాన్ని ఒప్పుకున్నట్టు మాత్రమే !

సరే, రాజేశ్వరి శంకరం యింటికి వెళ్ళింది. అతడి భార్యను చూసింది. అందాకా బాగానే వుంది. చూసిన తర్వాత ఆమెను పోల్చుకోవడం దగ్గరినుంచే ఈ కథ నా పైన అక్షరాలా తిరుగుబాటుకు పూనుకోవడం ప్రారంభమైంది.

"ఏమండోయ్, టోలెడన్ని కొత్త వర్తమానాలు పట్టుకొచ్చేశాను. వినగలిగే గుండె దిటవు మీకుండాలే గానీ, చెప్పడానికి నేను తయారు..." అంటూ ఉపక్ర మించింది రాజేశ్వరి.

"అబ్బో, ఏమిటోగదా, ఆ సాహస గాథ! అంత థ్రిల్లింగ్‌గా వుంటుందా రాజేశ్వరీ?" అన్నాను అమాయకంగా!

"తల్లిదండ్రులు కట్టిపెట్టిన యింట్లో వుంటూ, పల్లెల్లోనుంచీ వచ్చే గింజలు తింటూ, జీతంలో ఎక్కువ భాగం జల్సా ఖర్చులకే వాడకునే మీలాటి వాళ్ళకింతకు మించిన థ్రిల్లింగ్ యింకొకటుండదు. అన్నట్టు శంకరం భార్యను నేను పోల్చుకున్నానని చెప్పాను గదండీ! ఆవిడ ఎవరోనని అడిగరే?"

—చెప్పింది రాజేశ్వరి.

రాజేశ్వరి తండ్రి పోస్టుమాష్టరుగా పనిచేశాడ. పిల్లి తన కూనల్ని నోట కరచుకుని పదిళ్ళు తిరిగినట్టుగా ఆయన తన ఉద్యోగ జీవితంలో పిల్లలకు పదింటికి మించిన ఊళ్ళే చూపించాడు. ఆయన పలమనేరులో వుండగా పోస్టాఫీసు కెదురుగా ఓ శిరస్తాదా రుండేవాడు. ఆ శిరస్తాదారుగారి ముద్దో అమ్మాయే రేవతి. రాజేశ్వరి కంటే చిన్నది. ఆవిడ అయిదో తరగతిలో వుండగా, ఆమె రెండో తరగతి చదువుతుండేది.

"వట్టి అబ్బనాకారపు పిల్లలెండి! వెర్రిబాగుల్ది గూడా! చిన్నప్పటినుంచీ అంతే! తాయిలం యిస్తానంటే అయిదు గుంజీలు తీసేది. మా యింట్లో మేము మా నాన్నగారిని పిలుస్తుంటే, తాను గూడా 'నాన్నా, నాన్నా' అంటూ సిద్ధమయ్యేది. ఒకసారి ఏమయిందనుకున్నారు..." గొల్లున నవ్వేస్తూ కొనసాగించింది రాజేశ్వరి. "వాళ్ళ నాన్నగారి గడ్డానికి సబ్బు పూసి మంగలి కత్తి చేతికి తీసుకున్నాడో లేదో, ఈ పిల్ల పెంకు లెగిరిపోయేటట్టుగా ఏడుస్తూ వీధిలోకి పారిపోయింది.

ఓ క్షణం ఆగి అడిగింది- "ఏమండీ! చిత్రంగా లేదూ?"

"ఏమిటి ఆ పిల్ల వీధిలోకి పారిపోవడమా?" అన్నాను.

"కాదండీ, యిన్నాళ్ళ కిన్నాళ్ళకు మేమిలా కలుసుకోడం! తనవైపు తేరి పారజూస్తూ నేనేమో గుమ్మంలో నిల్చున్నాను. చేటలో బియ్యం పోసుకుని రాళ్ళకూ కూర్చుందేమో, అలికిడి వినిపించేసరికి తల పైకెత్తి నా వైపు చూస్తూ ఆ అమ్మాయి బొమ్మలా వుండిపోయింది. మొట్టమొదట నేనే తమాయించుకుని 'నువ్వు—నువ్వు' అని మాత్రం అనగలిగాను. 'రాజేశ్వరక్కయ్యవి గదూ....' అంటూ ఆ పిల్లగాలిలా వచ్చి దగ్గరగా నన్ను వాటేసుకుంది. "ఎంత కాలానికి

కనిపించావు రాజేశ్వరక్కయ్యా! మీ రిక్కడేనా వుండడం! మీ రున్నారని తెలిస్తే రెక్కలు గట్టుకొచ్చి వాలిపోయే దాన్ని..." అంటూ వుక్కిరి బిక్కిరై పోయింది"

"ఎలాగైతేనేం, బాల్య స్నేహితురాళ్ళు కలుసుకున్నారు. ఏ పాటి సత్కారము లభించిందో చెప్పు..."

"ఏమండీ!" ఉల్లాస లక్షణాల నన్నింటినీ త్రోసిరాజని.రాజేశ్వరి ముఖంలో తీవ్రమైన భావమేదో తొంగి చూసింది. "మీరు సినిమాల్ని ఎగతాళి చేస్తారు. రాజకీయాల్ని ఎగతాళి చేస్తారు. కవుల్ని కూడా ఎగతాళి చేస్తారు. అంతెందుకు సాక్షాత్తు దేవుడు కూడా మీ ఎగతాళి నుంచీ తప్పించుకోవడం లేదు. కానీ మనిషిగా పిలవబడే ప్రతి వ్యక్తి గుండెలు నీరై పోయేటట్టుగా కృంగిపోవలసింది దేన్ని చూసి? దారిద్ర్యాన్ని చూచి. ఆ దరిద్రాన్ని మాత్రం ఎగతాళి చెయ్యనని మాట యిస్తేగానీ నేను చెప్పలేను. ఆ యింట్లో కాఫీ పెట్టి యివ్వడానికి గుక్కెడు పాలుగానీ, అందులో కలపడానికి చిటికెడు చక్కెర గానీ లేదంటే మీరు నమ్ముతారా?"

"అర్థమయిందిలే రాజేశ్వరీ!" పెళ్ళాన్ని ఘోషాలో పెట్టడమే గాదు, ఇంట్లో నిప్పుచ్చరం కూడా నెలకొల్పి వుంటాడు, నాకు తెలుసు. వాడాపాటి నిర్వాకము చేయగలవాడే!"

"ఏమండీ! నాకు తెలియక అడుగుతాను, డబ్బు దుబారా కాగల చెడు అలవాట్లేవైనా శంకరాని కున్నాయా?"

ఈ సారి గొల్లున నవ్వే వంతు నాకు వచ్చింది. నవ్వి నవ్వి "అంత మంచి ముఖానికి అర్ధశేరు కుంకుమ గూడానా రాజేశ్వరీ! వాడికిపోయి చెడు అలవాట్లా? ఆ మాత్రం ప్రయోజకత్వం గూడా ఏడ్చిందా మనిషిలో! అదేం లేదు వాడు తాంబూలం నమలడమైనా నేను చూడలేదనుకో!"

"మరైతే చేతికొచ్చే డబ్బంతా ఏమవుతుందంటారు!"

"ప్రపంచంలో సేవింగు స్కీమ్ లెన్ని లేవు! పోస్టాఫీసులో వేస్తాడు. బ్యాంకులో కడతాడు. నిలవ చేసిన మొత్తాన్ని అంకెల రూపంలో చూచుకుంటూ ఆనందపరవశుడౌతాడు...,"

ఏమండీ! ఇదంతా మీ కెవరు చెప్పారు?" క్రాసు పరీక్షలో పాయింటు దొరికిన న్యాయవాదిలా విరుచుకపడింది రాజేశ్వరి.

నేను కూడా వులిక్కిపడి, వీలయినంతలో జాగరూకుణ్ణిగా వుండటానికి ప్రయత్నిస్తూ "ఇంకొక రెవరో వచ్చి చెవితేగాని తెలియదా? నాకామాత్రం ఊహా శక్తి లేదేమిటి?" అన్నాను.

"ఒక గాడివెంట ఆలోచించుకోడానికి అలవాటు పడిపోయి యింకొక రకంగా ఊహించలేకపోవడం దగ్గరేనండీ చిక్కువచ్చేది! నిలవ చెయ్యొచ్చు. దుబారా చెయ్యొచ్చు. ఈ రెండింటినీ మినహాయించి డబ్బును వినియోగించడానికింకొక మార్గమే లేదంటారా?"

నేను తెల్లబోయాను. ఈ కథ ఎక్కడ ప్రారంభమైందో నాకు తెలుసు. కానీ ఎక్కడికి వెళ్ళి తేలుతుందో నాకు అంతుపట్టడం లేదు. అంతకంతకూ దీన్నొక 'పజిల్'గా రూపొందించి మా ఆవిడ నన్ను ఆటపట్టిస్తున్న తీరు చూస్తుంటే నాకు చిరాకు ముంచుకొచ్చింది.

"ఫరవాలేదు. ఆలోచించుకునే చెప్పండి. వంటపనులన్నీ ముగించుకుని వచ్చేదాకా గడువిస్తున్నాను" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

సవాలు విసిరినట్టుగా మా ఆవిడ నన్నే ఆలోచించుకోమనడం నాకు మెత్తటి అవమానంలా తోచింది. అందుకని ఆ పనికిమాలిన విషయాన్ని గురించి బొత్తిగా ఆలోచించబోవడమేలేదని భీష్మించుకున్నాను. భోజన కార్యాన్ని కూడా మౌనంగానే పూర్తికానిచ్చి, మళ్ళీ హాల్లోకి వెళ్ళి యేదో వారపత్రిక చదువుకో సాగాను.

అరగంటసేపటి తర్వాత "మాష్టరుగారికి కోపం వచ్చినట్టుంది" అని దిగ్గర గానే స్వగతం పలుక్కుంటూ హాల్లోకి వచ్చింది రాజేశ్వరి.

"నాకు కోపమా! ఎందుకూ?" ఆమెవైపు వికృరించి చూశాను.

"అదేనండీ శంకరం కథ! డబ్బు ఖర్చవుతున్న వైనం, దుబారానా, పొదుపా? లేక వేరే కారణమా? వగైరా వగైరా...మరచిపోయారా?"

"రాజేశ్వరీ! అది నువ్వు తయారు చేసిన పొడుపు కథ. చేతనయితే నువ్వే విప్పు. లేకపోతే వూరుకో! నేను చదువుకోవాలి..." పత్రిక తెరవబోయాను.

కాంయాలం దబ్బా నా చేత బెట్టి పత్రికను మెల్లగా తన చేతిలోకి లాక్కుంటూ అంది రాజేశ్వరి—"డాక్టరీ చదువుకుంటున్న తమ్ముడికి ప్రతి నెలా రెండు వందలదాకా పంపించుకోవలసి వస్తుందట! ఆ మధ్య ఎప్పుడో చెల్లెలి పెళ్ళి కోసం ప్రావిడెంటు ఫండు నుంచి తీసుకున్న అప్పుకోసం జీతంలో యాభైరూపాయలు పట్టుకుంటారట. ఏమండీ వింటున్నారా?"

ఈ వర్తమానం తాకిడికి నేను దంగైపోతానని ఎదురుచూసిందేమో రాజేశ్వరి, అదేం జరగలేదు సరిగదా- నాలో యెంతో కొంత ఆగ్రహమే పరవళ్ళు త్రొక్కింది.

"నీకు తెలియదా రాజేశ్వరీ! దీనిపేరే 'త్యాగం'. సినిమాల్లోనూ, పుస్తకాల్లోనూ దీన్ని గురించి బోలెడంత ఇన్‌ఫర్మేషన్ దొరుకుతుంది" అన్నాను.

"అంతేగానీ నిత్యజీవితంలో దీనికి చోటు లేదంటారు, అవునా?"

"నీ సెంటిమెంట్స్‌ను తీసుకొచ్చి నా తలపైన పులమొద్దు రాజేశ్వరీ! ఎందుకొచ్చిన త్యాగం? మురికి కొంపలో కాపురమాయె! తాను వేసుకోడానికి మూడో జత బట్టలు లేకపోయె! అతిథి యింటికొస్తే కాఫీచేసి యివ్వడానికయినా దారి దొరక్కపోయె! అంతెందుకు తన కెన్ని చీరలున్నాయో నువ్వు నీ స్నేహితురాల్ని అడిగివుండవల్సింది..."

"అడిగాను లెండి! కట్టు విడుపు చీరలు రెండో మూడో వున్నాయట! ఏ ఆషాడానికో, అమావాస్యకో సినిమాకు వెళ్ళే అవకాశం దొరికితే పెళ్ళినాటి ముహూర్తం చీర కట్టుకుని వెళుతుందట!"

"పోనీ ఆ చీరే కట్టుకుని మనింట్లో పేరంటాని కొచ్చి వుండొచ్చుగా! యెందుకు రాలేదో అడిగావా?"

"చెప్పింది. వాళ్ళ నాన్నగారు రేవతికి వేసిన ఆరు తులాల గొలుసును శంకరం తన చెల్లెలి కిచ్చేశాడట! ఆ నగ పెడితేగానీ చెల్లెలికి పెళ్ళయ్యేటట్టులేదు! ఏం చేస్తాడు?...పాపం ఆ అమ్మాయి బోసిమెడతో సాటి ఆడవాళ్ళలోకి యెలా వస్తుందండీ?"

"నా మాటగూడా కాస్త వింటావా రాజేశ్వరీ! తనకు మించిన తల్మాల జోలికి వెళ్ళనేగూడదు. వెళ్ళావో, అందువల్ల యెదురయ్యే కష్టనష్టాల్ని నువ్వే భరించాలి. అంతేగాని నిన్ను కట్టుకున్న నేరానికి నీ పెళ్ళాన్ని శిరచ్ఛేదంలా బ్రతకమనే అధికారం నీ కెవడిచ్చాడు చెప్పు"

"ఇంత ఘాటుగా కాకపోయినా నేను అదే మాట చెప్పాను. రేవతి ఏమందో తెలుసా? 'పోనీలే అక్కయ్యా! నగలు ముఖ్యమా, బాంధవ్యాలు ముఖ్యమా? మంచి రోజులొస్తే మా నగలు మేమే చేయించుకుంటాం' అంటూ ఆ పిల్ల నన్నే ఓదార్చబోయింది..."

"వరుసగా రాసిపెట్టుకుంటే ఆ మాటలు సినిమాలో డైలాగులుగా వాడుకోడానికి పనికొస్తాయి" అంటూ ఆ ప్రసంగాన్ని నే నంతటితో త్రుంచి పారేశాను.

మరునాటి ఉదయం ఆఫీసుకు వెళ్ళానా, పది గంటలకు సరిగ్గా లోపలికి వస్తూ శంకరం కనిపించాడు. నా ప్రయత్నాని కలితంగా శంకరంపట్ల నాలోని నిరసన భావం తగ్గివుంటే అందుకు నేనేం చేయగలను? అతడు దగ్గరి కొచ్చేసరికి 'ఏమోయ్ శంకరం! ఏమిటి విశేషాలు?' అని పలకరించి, అంతపనీ జరిగిపోయి నందుకు నాలో నేనే ఆశ్చర్యపడి పోయాను.

శంకరంకూడా కాస్త తొట్రుపాటుతోనే నా ఎల్లదగ్గర ఆగి, 'విశేషాలే మున్నాయండీ! అంతా మామూలే!' అని, అంతలో అసలు విషయం జ్ఞప్తికి వచ్చినట్లయి 'అన్నట్టు వదినగారు నిన్న మా యింటి కొచ్చారట కదూ! యిన్నిప్పుడు వీళ్ళు ఎదురెదురు యిళ్ళలోనే వుండేవారట! మా రేవతి ఆనందానికి పట్ట పగ్గా లేవనుకోండి!' అన్నాడు.

ఎలాగైతేనేం, వరుసలు కలిశాయి. రాకపోకలు కూడా ప్రారంభమయ్యే టట్టున్నాయి. శంకరం ఈ మాత్రంగానైనా ఒక్కింత సంతుష్టిగా మారాడంటే, ఇదంతా రాజేశ్వరి చలవ! ఆమెకు అభినందనలు చెప్పదలుచుకున్నాను—

సాయంకాలం యింటికి వెళ్ళేసరికి రేవతి చంటిబిడ్డ నెత్తుకుని మా యింటికి వచ్చి వెళ్ళిన విషయం రాజేశ్వరి నా చెవిలో వేసింది.

ఒక వస్తువుపట్ల గానివ్వు, మనిషిపట్ల గానివ్వు మన దృక్పథంలో మార్పంటూ వచ్చిన తర్వాత ఆ మారిన దృక్పథానికి అనుగుణ్యంగా మన ప్రవ

రత గూడా తనంతటదే మారిపోతుంది కాబోలు ననిపిస్తుంది. హేళనకు బదులుగా శంకరంపట్ల నాలో జాలిలాంటి భావమేదో చోటుచేసుకుంటున్నదేమోనని నేను ఆత్మపరిశీలన చేసుకున్నాను. అంతరంగంమాట ఏమిటోగానీ, బాహ్యప్రవర్తనకు సంబంధించి నేను శంకరాన్ని ఎగతాళి పట్టించడం మెట్టుకు మానుకున్నట్టే వున్నాను. ఎవరైనా అతణ్ణి గురించి తేలికగా మాట్లాడుతుంటే దూరంగా గూడా వెళ్ళిపోతున్నాను.

మొత్తానికి యితడు మన అంచనాకు సరిపడివచ్చే మానవుడు కాడని తెలిసిపోవడంతో ఆఫీసుకుమాత్రమే పరిమితమైన మా సహజీవనంలో శంకరాని కివ్వదగినంత గౌరవం అతడికిచ్చి, నేను పుచ్చుకోవలసినంత గౌరవం నేను పుచ్చుకోడానికి అలవాటుపడ్డాను.

నెలలూ, సంవత్సరాలూ గడిచిపోతున్నాయి.

"ఇంకొక సంవత్సరంలో మా తమ్ముడి కోర్సు పూర్తయిపోతుందండి!" అన్నాడు శంకరం.

ఆ సంవత్సరం గడిచేలోగానే శంకరానికి మా వూరినుంచి ట్రాన్స్ఫరు వచ్చింది.

చెప్పడం మరిచాను. ట్రాన్స్ఫర్ కావడానికి మూడు మాసాల క్రితం ఒక నాటి సాయంకాలం యేడుగంట లప్పుడు శంకరం నాకు బజారులో తారసిల్లాడు. మామూలుగానే పలకరించబోయి, అతణ్ణి వెన్నంటి వున్న యింకొక వ్యక్తినిచూసి, నేను యించుమించు నిర్ఘాంతపడిపోయాను. శంకరం యెంత ఎత్తున్నాడో అతడున్నూ అంతే యెత్తున్నాడు. నడిచే పద్ధతిలో నడుస్తుండగా చేతులు కదిలేతీరులో, ముఖకవళికల్లో అన్నింటా అచ్చు గుద్దినట్టుగా అతడిలో శంకరం పోలికలే కానవస్తున్నాయి. లేదంటే పదిహేను రోజులపాటు శంకరం జబ్బుపడి లేస్తే యెలా వుంటాడో అలా కొంచెం బక్కపలచగా, నీరసంగా వున్నాడు. మరొక ముఖ్యమయిన తేడా, అతడి క్రాపింగు బాగా పలచబడి తెల్లబారిపోయి వుండడం! శుభ్రంగా ముఖం గీక్కుని వుండడంవల్ల తెలియడంలేదు గానీ, బహుశా అతడి మీసాలుగూడా నెరిసిపోయే వుండొచ్చు...

కొత్త వ్యక్తి సముఖంలో వుండగానే 'ఇత డెవరు?' అని శంకరాన్ని

అడగడానికి నా సంస్కారం నాకు అడ్డుపడింది. ఇలాంటి సందర్భాల్లో కొత్తమనిషిని పాత స్నేహితుడు పరిచయం చేసిపెట్టడం సహజమయిన లోకవ్యవహారం. కానీ శంకరానికి అపాటి యింగితజ్ఞానం లేనట్టే తేలిపోయింది. ముక్తసరిగా ఒకటి రెండు మాటలు మాట్లాడి అతడు జనసమూహంలో కలిసిపోయాడు.

మరునాడు ఆఫీసులో అడిగితే చెప్పాడు శంకరం—"మీరు భలేవారండీ శేఖరంగారూ! ఆయ నెవరో గాదు మా నాన్నగారు!"

ఆశ్చర్యాతిరేకంలో నేను బిర్రబిగుసుకపోయాను. శంకరంలాంటి నడితరం యువకులకు తల్లిదండ్రు లుండడంలో అబ్బురమేమీలేదు. కానీ యిన్నాళ్ళుగా శంకరం తండ్రి సజీవుడుగా వున్నాడని నాకు తెలియకపోవడమే విచిత్రం. 'లేదు' అని శంకరం చెప్పలేదనుకోండి! కానీ వున్నట్టుగా రవ్వంత ప్రస్తావన అయినా యెందుకు రాకపోవాలి? పెద్దన్నయ్య తండ్రితో సమానమంటారు. కానీ అదెప్పుడు? తండ్రి లేనప్పుడు. తండ్రి బ్రతికుండగా కొడుకు తనొక్కడే నిస్సహాయంగా కుటుంబ భారన్నంతా మోయవలసి రాదుగదా!

నా మాటల్లో నేను చూచాయగా యిదే భావాన్ని వెల్లడించానేమో, ఇలాంటి సందేహాన్ని మొదటిసారిగా వింటున్నట్టు శంకరం అయోమయంగా నా వైపు చూశాడు.

మా అమ్మ పోయి పదిహేనేళ్ళయింది గదండీ శేఖరంగారూ, ఆ తరువాత ఏడెనిమిదేళ్ళకే మా నాన్నగారు రిటైరయిపోయారు. ఆయన చేసింది సమితిలో ఆర్. యం. పి. వుద్యోగం. ఆయన సంపాదన అప్పటికప్పుడే సరిపోతూ వచ్చింది. తాను గూడా ఓ అదనపు భారంగా ఉండడమెందుకని ఆయన రిటైరయ్యాక గూడా పల్లెలోనే వుండిపోయారు. కొద్దిగా ఓ మోస్తరు ప్రాక్టీసుగూడా జరుగుతోందటలెండి...

ఈ సరికొత్త వర్తమానం విని రాజేశ్వరి గూడా నోరు తెరిచేసింది. "అయినా వీళ్ళేం మనుషులండీ బాబూ! ఆ రేవతి గూడా తన మామగారిని గురించి ఒక్క మాటయినా చెప్పింది కాదే!" అంటూ విస్తుపోయింది.

"అంతేలే! గడప ఉడిగిన తర్వాత అయిన వాళ్ళు గూడా మనిషిని మనిషి క్రింద లెక్కగట్టగలరు..." అంటూ చటుక్కున రాజేశ్వరి ముఖంలోకి చూసి

వెంటనే నాలుక కొరుక్కున్నాను. ఆమె నా మాటల్లో ఏదో పొరపాటును శంకిస్తున్నట్టు తోచింది.

శంకరానికి వచ్చిన బదిలీ వట్టి బదిలీగా గాకుండా ఒక మెట్టు ప్రమోషనుగా గూడా వచ్చింది. సర్వీసులో సీనియారిటీ కలిగిన వాళ్ళెందరో వుండగా శంకరానికి ప్రమోషన్ రావడం గురించి సహోద్యోగుల మధ్య తర్జన భర్జన చాలా జరిగింది. తేలిన విషయాన్ని బట్టి చూస్తే అతనికి ప్రమోషన్ రావడంలో విద్దూరమని చెప్పుకో దగ్గదేదీ కనిపించింది గాదు. అతడెప్పుడో అయిదారేళ్ళ క్రిందటే డిపార్ట్‌మెంటల్ పరీక్షలన్నీ పాసై వున్నాడు.

ఆఫీసులో శంకరానికి చిన్న టీ పార్టీతో వీడ్కోలు ముగిసింది. అతణ్ని గురించి వరుసగా నాలుగు మంచి మాటలు స్ఫురించకపోవడంవల్లనైతేనేమి స్ఫురించినా వాటిని వల్లించే ఓపరికం లేకపోవడంవల్లనైతేనేమి, ఆ సందర్భాల్లో ప్రసంగాల కార్యక్రమం ఆపివేయబడింది. సాగనంపడానికి నేనూ, రాజేశ్వరి మాత్రం స్టేషనుకు వెళ్ళాము. "రాజేశ్వరక్కయ్యా! మమ్మల్ని మరచిపోవుగదూ?" అంటూ రేవతి మా వైపు దీనంగా చూసింది. ఈ వైరిభాగుల అమ్మాయి ఈ లోకంలో ఎలా బ్రతుకుతుందో గదా అనిపించి నా కళ్ళు చెమ్మగిల్లిపోయాయి. రాజేశ్వరి తన స్నేహితురాలి చెయ్యి గట్టిగా నొక్కిపట్టి. ఆ స్పర్శతోనే ఆత్మవిశ్వాసాన్ని సరఫరా చేసినట్టుగా, "నీకేం భయంలేదులేవే రేవతీ! ఇంకా నువ్వే మమ్మల్ని మరిచిపోతావేమో! భగవంతుడనే వాడుంటే గింటే మనిషిలోని మంచితనంలోనే ఉన్నాడు" అంది.

ఒకదానికొకటి సంబంధం లేకుండా రాజేశ్వరి చెప్పిన మూడు వాక్యాలనే మననం చేసుకుంటూ ఉండగా రైలు కదిలింది.

శంకరం బదిలీ అయిపోయిన తర్వాత మూడు మాసాల కొకనాడు ఆఫీసు జవాను జకరయ్య నా దగ్గరికొచ్చి "బాబుగారూ! శంకరం బాబు వ్రాశాడండీ! బియ్యే ప్యాసయ్యాడట! శేఖరంగారికి చెప్పవలసిందని వ్రాశాడు" అన్నాడు.

"పోనీలే! శుభవార్త నీకైనా తెలిపాడు. సంతోషం" అని అంతలోనే పరధ్యానం నుంచి తేరుకుంటూ "అన్నట్టు జకరయ్యా! శంకరం బియ్యేకి కట్టడమూ, చదవడమూ, పాసుకావడమూ గూడా అయిపోయిందా! నాకా వివరాలేవీ తెలియవే!" అన్నాను.

"పరీక్ష ఫీజు కట్టాలంటే నూటికి రెండు రూపాయల రేటుతో రెండు వందల రూపాయలు అప్పు యిప్పించాను. ఆ డబ్బు తిప్పి పంపుతూ కూపనులో నాలుగు మాటలు వ్రాశాడు. పరీక్షకు డబ్బు కట్టడంతో ఏమయింది గానీండి, ఆ మానవుడికి చదువుకోవడం దగ్గరే పెద్దయిబ్బంది వచ్చింది. అగ్గిపెట్టెల మేడలో తొమ్మిదింటికి తర్వాత లైటు వేసుకోనివ్వరు. శంకరం పార్కులో కూచుని చదువుకొనే వాడు..."

శంకరాన్ని గురించి నాకెన్నో విషయాలు తెలిసినట్టే వుండేవి అయితే సరికొత్తగా ఒక విషయం తెలిసొచ్చేటప్పటికి పాత అభిప్రాయాలను మార్చుకో వలసి వచ్చేది. లేదా సవరించుకోవలసి వచ్చేది.

అయితే శంకరం బియ్యే పరీక్ష కోసం పార్కు దీపం క్రింద చదువు కున్నాడా?

• • • •

శంకరం మా ఊరినుండి వెళ్ళిపోయి పదిహేనేళ్ళయింది. సేవ, త్యాగం, ఆదర్శం మొదలైన భావాలు క్రమ్ముకునప్పుడెప్పుడైనా అతడు మనసులో మెదలడం కద్దు. కానీ కొన్ని కొన్ని మంచి పదాల అంతరార్థం కాలక్రమాన మారిపోతూ రావడం గమనిస్తే ఆశ్చర్యంగానే వుంటుంది. "ఓహో! అతనా! చాలా పెద్దమనిషి లెండి!" అని ఎవరైనా అంటే, మనం వెంటనే అతణ్ణి దగుల్బాజీ అనుకుంటాము. ఆ యీ కారణంవల్ల శంకరాన్ని గొప్ప చేసి చెప్పుకోడానికి నేను వెనుకాడేవాణ్ని. శంకరాన్ని నేను బుద్ధుణ్ణిగా చిత్రించాను నిర్భీగిగా ప్రచారం చేశాను. అందుకు విభిన్నంగా అతణ్ని గురించి మరొక విధంగా చెప్పుకోవాలంటే మాత్రం నా గొంతుకలో వెలక్కాయపడ్డట్టే వుండేది...

మసిబారిన అద్దంలో ప్రతిబింబం సజావుగా కనిపించకపోతే అది వస్తువు యొక్క దోషం ఎలాగవుతుంది? ఒక వ్యక్తిని గురించి మనమేమనుకుంటామో, ఎలా చిత్రించడానికి ప్రయత్నిస్తామో దాటి మూలంగా మన వ్యక్తిత్వం మాత్రమే విశదమవుతుంది. అందువల్ల గడచిన పదిహేనేళ్ళలో శంకరాన్ని గురించి నాకు తెలిసొచ్చిన ఒకటి రెండు విషయాలను మాత్రమే ఉటంకించి అంతటితో ఈ కథ ముగిస్తాను.

తండ్రి కానే వృత్తిలోనైతే వున్నాడో అదే వృత్తిలో కుమారుణ్ని గూడా

ప్రవేశపెట్టాలనుకోడం మనదేశంలో రివాజు. ఆ సాంప్రదాయం మేరకు మా బావమరిది గూడా తన తండ్రిగారిలాగే పోస్టలు డిపార్టుమెంటులో ప్రవేశించాడు. ఎక్కడెక్కడో దూర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ వుండి అతడు కురబలకోటకు వచ్చి పోస్ట్ మాష్టరుగా ఛార్జీ తీసుకున్న క్రొత్తలోనే వొకసారి ఆ ఊరికి వెళ్ళడం తటస్థించింది. వెళ్ళిననాటి సాయంకాలకి మా బావమరిదితో కలిసి నేను ఊరిబయటికి వెళ్ళి తిరిగొస్తుండగా మసక చీకటివేళ బజారులో మరొకవ్యక్తి ఎదురయ్యాడు. అతణ్ణి చూచిన క్షణంలో నేను "ఏమిట్రా ఇది శంకరం యిక్కడున్నాడా?" అనుకుంటూ తెల్లబోయాను. మరుక్షణంలో అబ్బే, శంకరం యింత ముసలివాడు గావడం ఎలా సంభవ"మని నాలో నేనే వితర్కించుకున్నాను. తరువాత కొద్ది క్షణాలకు అతడు శంకరం నాన్నగారని చటుక్కున స్ఫురించింది.

మా బావమరిది ద్వారా అతణ్ణి గురించి కొంచెం భోగట్టా లభించింది గూడా!

"ఎవడు బావా? డొక్కు డబ్బాలాంటి ఆ ముసలాయన్ను గురించేనా నువ్వడిగేది? ఈ ఊరికి నేను కొత్తయినా అతడేమో నాకు పాత కానీ ఆఫీసుకు తరచుగా వస్తుంటాడు గనుక! పేరు సత్తిరాజు. అయితే యిక్కడి జనం అతడికి పెట్టిన ముద్దు పేరేమిటో తెలుసా? అరవైయేళ్ళ బాలా కుమారుడు? ముసలి శరీరములో పడుచు బుద్దులు కన్పిస్తుంటే, ఇలా వ్యవహరించాలనిపించడం న్యాయమే గదూ! కాకపోతే రిటైర్ కావడానికి ఏడెనిమిదేళ్ళు మాత్రమే వుండనగా ఇతడు తగుదునమ్మా అని పెళ్ళికి సిద్ధమౌతాడా! ఏం మనిషోలే బాబూ, ఇతని కిప్పుడు ఎలిమెంటరీ స్కూలుకు వెళ్లే పసివాడి దగ్గరనుంచీ పాలు తాగే చంటిపాపదాకా నలుగురు బిడ్డలున్నారు..."

నాకు నవ్వొచ్చింది. మా బావమరిది ఒకరిని గురించి చెప్పబోయి, ఇంకొకరిని గురించి చెబుతున్నాడేమో ననిపించింది "చాల్లేవోయ్ ముసలాయన్ను పట్టుకొని బాగానే వసంతా లాడుతున్నావులే! నాకు తెలియదను కుంటున్నావేమో ఈ ఈ సత్తిరాజు కొడుకు శంకరం నాలుగైదేళ్ళపాటు నాతో కలిసి మా ఆఫీసులో పని చేశాడు. ఈ భార్య ఏనాడో చనిపోయింది" అన్నాను.

"అయ్యో! భార్య చనిపోయి వుండొచ్చు. ఆ చనిపోయిన భార్యకు నలుగురైదుగురు బిడ్డలు గూడా వుండొచ్చు. అంతమాత్రాన మొదటి భార్య పోయాక సత్తిరాజు రెండో పెళ్ళి చేసుకున్నాడన్న నా స్టేట్‌మెంట్ తప్పెలా అవుతుంది?

నీకు తెలిసింది సగం నిజం మాత్రమే! మిగిలిన సగం నేనిప్పుడు చెప్పింది. నువ్వు పూర్తి నిజాన్ని గుర్తించడానికి నిరాకరిస్తే నేనేం చెయ్యగలను?" అన్నాడు మా బావమరిది.

ఇంటిలో బలమూ, చేతిలో డబ్బూ వుండతీరాలన్న పట్టింపు కూడా లేదు— మగవాడు ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకోడానికి మన సమాజం అంగీకరిస్తుంది. అరదు లోనూ మొదటి భార్య చనిపోయింది. కనుక సత్తిరాజు రెండో పెళ్ళి చేసుకున్నం దుకు అభ్యంతర పెట్టే హక్కు మనకు లేదు. అయితే తన మొదటి సంబంధం బిడ్డల జీవితం సాఫీగా గడచిపోవడానికి అతడు వాళ్ళ కేదైనా చూపించినాడా లేదా అన్నది వేరే విషయం. ఎవళ్ళ రాతకొద్దీ వాళ్ళు పోతారని భావించి వుండొచ్చు. పుట్టించిన వాడు "పూరి"వేయకపోడని ఆశించి వుండొచ్చు. కొందరికి తమ అవ సరాలు తీరడమే ముఖ్యం. దుస్తులన్నీ వూడదీసి అవతలికి గిరవాటుపెట్టి,బహిరంగ స్థలాల్లో నిద్రపోయే హిప్పీలకు మల్లే వాళ్ళు తమ బాధ్యతల్ని గాలికి వదిలెయ్య గలరు!

సత్తిరాజుపట్ల నాలో ఆగ్రహం పరవళ్ళు దొక్కింది. నేనే గనుక శంకరం స్థానంలో వున్నట్టయితే "నాకు తండ్రి లేనేలేడు. ఏనాడో చనిపోయా"డని చెప్పు కోడానికి వెనుదీసి వుండను.

పై సంఘటన జరిగిన తర్వాత తొమ్మిదేళ్ళకుగానీ నేను శంకరాన్ని కలుసు కోలేకపోయాను. ఆఫీసు పనిపైన హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. "ఏమోయ్ శంకరం! బాగున్నావా?" అంటూ యిప్పుడతని భుజంపైన చెయ్యి వేయడానికి వీలుండదని నాకు తెలుసు. నా పేరు వ్రాసిన చీటీని జవాను చేతికిచ్చి దాన్ని డిప్యూటీ డైరెక్టరుగారికి అందజేయమన్నాను. చీటీ అందుకోవడమే తడవుగా శంకరం వెయిటింగు రూములోకి పరుగెత్తుకొచ్చేశాడు. "ఎంత కాలానికండీ శేఖరంగారూ! బాగున్నారా? వదినగారు కులాసానా? సకుటుంబంగా రాలేక పోయారా?" అంటూ ప్రారంభించి ముందుగా ఏ ప్రశ్నకు జవాబు చెప్పాలో తోచకుండా నన్ను వుక్కిరి బిక్కిరి చేసేశాడు. కుశలప్రశ్నలన్నీ సాంగో పాంగంగా పూర్తయ్యాక నేను ఆఫీసు వ్యవహారం ప్రస్తావించబోయేసరికి, "అవన్నీ అదంతా నిదానంగా చూసుకుందాం లెండి శేఖరంగారూ! మీరు యింటికి వెళ్ళండి. స్నానం కానిచ్చి భోజనం చేసి "రెస్ట్ తీసుకోండి!" అంటూ నన్ను బలవంతంగా

ప్రవేశపెట్టాలనుకోడం మనదేశంలో రివాజు. ఆ సాంప్రదాయం మేరకు మా బావ మరిది గూడా తన తండ్రిగారిలాగే పోస్టలు డిపార్టుమెంటులో ప్రవేశించాడు. ఎక్కడెక్కడో దూర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ వుండి అతడు కురబలకోటకు వచ్చి పోస్ట్ మాష్టరుగా ఛార్జీ తీసుకున్న క్రొత్తలోనే వొకసారి ఆఊరికి వెళ్ళడం తటస్థించింది. వెళ్ళిననాటి సాయంకాలకి మా బావమరిదితో కలిసి నేను ఊరిబయటికి వెళ్ళి తిరిగొస్తుండగా మసక చీకటివేళ బజారులో మరొకవ్యక్తి ఎదురయ్యాడు. అతణ్ణి చూచిన క్షణంలో నేను "ఏమిట్రా ఇది శంకరం యిక్కడున్నాడా!"అనుకుంటూ తెల్లబోయాను. మరుక్షణంలో అబ్బే, శంకరం యింత ముసలివాడు గావడం ఎలా సంభవ"మని నాలో నేనే వితర్కించుకున్నాను. తరువాత కొద్ది క్షణాలకు అతడు శంకరం నాన్నగారని చటుక్కున స్ఫురించింది.

మా బావమరిది ద్వారా అతణ్ని గురించి కొంచెం భోగట్టా లభించింది గూడా!

"ఎవడు బావా? దొక్కు డబ్బాలాంటి ఆ ముసలాయన్ను గురించేనా నువ్వడిగేది? ఈ ఊరికి నేను కొత్తయినా అతడేమో నాకు పాత కానీ ఆఫీసుకు తరచుగా వస్తుంటాడు గనుక! పేరు సత్తిరాజు. అయితే యిక్కడి జనం అతడికి పెట్టిన ముద్దు పేరేమిటో తెలుసా? అరవైయేళ్ళ బాలా కుమారుడు? ముసలి శరీరములో పడుచు బుద్ధులు కన్పిస్తుంటే, ఇలా వ్యవహరించాలనిపించడం న్యాయమే గదూ! కాకపోతే రిటైర్ కావడానికి ఏడెనిమిదేళ్ళు మాత్రమే వుందనగా ఇతడు తగుదునమ్మా అని పెళ్ళికి సిద్ధమౌతాడా! ఏం మనిషోలే బాబూ, ఇతని కిప్పుడు ఎలిమెంటరీ స్కూలుకు వెళ్లే పసివాడి దగ్గరనుంచీ పాలు తాగే చంటిపాపదాకా నలుగురు బిడ్డలున్నారు..."

నాకు నవ్వొచ్చింది. మా బావమరిది ఒకరిని గురించి చెప్పబోయి, ఇంకొకరిని గురించి చెబుతున్నాడేమో ననిపించింది "బాల్లేవోయ్ ముసలాయన్ను పట్టుకొని బాగానే వసంతా లాడుతున్నావులే! నాకు తెలియదను కుంటున్నావేమో ఈ ఈ సత్తిరాజు కొడుకు శంకరం నాలుగైదేళ్ళపాటు నాతో కలిసి మా ఆఫీసులో పని చేశాడు. ఈ భార్య ఏనాడో చనిపోయింది" అన్నాను.

"అయ్యా! భార్య చనిపోయి వుండొచ్చు. ఆ చనిపోయిన భార్యకు నలుగురైదుగురు బిడ్డలు గూడా వుండొచ్చు. అంతమాత్రాన మొదటి భార్య పోయాక సత్తిరాజు రెండో పెళ్ళి చేసుకున్నారన్న నా స్టేట్‌మెంట్ తప్పెలా అవుతుంది?

నీకు తెలిసింది సగం నిజం మాత్రమే! మిగిలిన సగం నేనిప్పుడు చెప్పింది. నువ్వు పూర్తి నిజాన్ని గుర్తించడానికి నిరాకరిస్తే నేనేం చెయ్యగలను?" అన్నాడు మా బావమరిది.

ఇంటిలో బలమూ, చేతిలో డబ్బూ వుండితీరాలన్న పట్టింపు కూడా లేదు—మగవాడు ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకోడానికి మన సమాజం అంగీకరిస్తుంది. అతడు లోనూ మొదటి భార్య చనిపోయింది. కనుక సత్తిరాజు రెండో పెళ్ళి చేసుకున్నందుకు అభ్యంతర పెట్టే హక్కు మనకు లేదు. అయితే తన మొదటి సంబంధం బిడ్డల జీవితం సాఫీగా గడచిపోవడానికి అతడు వాళ్ళ కేదైనా చూపించినాడా లేదా అన్నది వేరే విషయం. ఎవళ్ళ రాతకొద్దీ వాళ్ళు పోతారని భావించి వుండొచ్చు. పుట్టించిన వాడు "పూరి"వేయకపోడని ఆశించి వుండొచ్చు. కొందరికి తమ అవసరాలు తీరడమే ముఖ్యం. దుస్తులన్నీ వూడదీసి అవతలికి గిరవాటుపెట్టి,బహిరంగ స్థలాల్లో నిద్రపోయే హిప్పీలకు మల్లే వాళ్ళు తమ బాధ్యతల్ని గాలికి వదిలెయ్యగలరు!

సత్తిరాజుపట్ల నాలో ఆగ్రహం పరవళ్ళు దొక్కింది. నేనే గనుక శంకరం స్థానంలో వున్నట్టయితే "నాకు తండ్రి లేనేలేడు. ఏనాడో చనిపోయా"డని చెప్పకోడానికి వెనుదీసి వుండను.

పై సంఘటన జరిగిన తర్వాత తొమ్మిదేళ్ళుదాకా నేను శంకరాన్ని కలుసుకోలేకపోయాను. ఆఫీసు పనిపైన హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. "ఏమోయ్ శంకరం! బాగున్నావా?" అంటూ యిప్పుడతని భుజంపైన చెయ్యి వేయడానికి వీలుండదని నాకు తెలుసు. నా పేరు వ్రాసిన చీటీని జవాను చేతికిచ్చి దాన్ని డిప్యూటీ డైరెక్టరుగారికి అందజేయమన్నాను. చీటీ అందుకోవడమే తడవుగా శంకరం వెయిటింగు రూములోకి పరుగెత్తుకొచ్చేశాడు. "ఎంత కాలానికండీ శేఖరంగారూ! బాగున్నారా? వదినగారు కులాసానా? సకుటుంబంగా రాలేకపోయారా?" అంటూ ప్రారంభించి ముందుగా ఏ ప్రశ్నకు జవాబు చెప్పాలో నాలో తోచకుండా నన్ను వుక్కిరి బిక్కిరి చేసేశాడు. కుశలప్రశ్నలన్నీ సాంగోపాంగంగా పూర్తయ్యాక నేను ఆఫీసు వ్యవహారం ప్రస్తావించబోయేసరికి, "అవ్వేం అదంతా నిదానంగా చూసుకుందాం లెండి శేఖరంగారూ! మీరు యింటికి వెళ్ళండి. స్నానం కానిచ్చి భోజనం చేసి "రెస్ట్ తీసుకోండి!" అంటూ నన్ను బలవంతంగా

తీసుకొచ్చి టాక్సీలో కూర్చోబెట్టాడు. టాక్సీ కదల బోతుండగా "డ్రయివరు నాకు తెలిసిన వాడేలెండి. శేఖరంగారూ? మీరు డబ్బిచ్చినా పుచ్చుకోడు" అంటూ హెచ్చరించాడు.

ఎండల కడ్డంపడి దూసుకుంటూ, విసవిసలాడుతున్న వడగాల్పుల్ని తోసుకుంటూ టాక్సీ వెళ్ళి వెళ్ళి పచ్చిక జొంపాలతో, పూల మొక్కలతో, పొదరిళ్ళతో పరివేష్టితమైవున్న ఓ చిన్న మేడ ముంగిట నిలిచింది.

మండు టెండలలోనుంచీ చల్లటి నీడ పట్టులోకి వచ్చేసరికి ప్రాణాలకు హాయనిపించింది. అయితే ఆ చల్లదనం కూడా యింటి యిల్లాలి ఆదరణముందు వెల వెల పోవచ్చునని నేననుకోలేదు.

"బావగారూ! మీరా! అక్కయ్యేది"

"రాలేదమ్మా! నేనొక్కణ్ణే వచ్చానన్నాను"

"అంతేలెండి! మీకు మే మెవరిమి? నేనైతే మిమ్మల్ని తలుచుకోని రోజు లేదు. "ఏమండీ! వెళ్ళి అక్కయ్య వాళ్ళని చూసొద్దామండీ అని నేనంటే, ఏవో పనులున్నాయంటూ" ఈయన నా మాట వినిపించుకోరు. మీరైనా అంతే! లేక పోతే రాకరాక యింత కాలానికొస్తూ అక్కయ్యని తీసుకురాకుండా వస్తారా?"

"పొరబాటయి పోయిందమ్మా! ఇంకొకసారి వచ్చినప్పుడు తప్పకుండా మీ అక్కయ్యని తీసుకువస్తా"నని చెప్పుకోవడం తప్పితే గత్యంతరం లేకుండా పోయింది.

బాయిలర్ నిండుకు కాగిన నీళ్ళను పెద్ద అండాలోకి తోడింది రేవతి. బడలిక తీరేలా స్నానం చేసి, సుష్టుగా భోజనం చేసేసరికి గాఢంగా నిద్ర పట్టింది.

నేను నిద్రపోతుండగానే ఆఫీసు నుంచీ వచ్చిన శంకరం టిఫిన్ చెయ్యమని భార్యకు పురమాయించి, ఆ పనిలో ఆమెకు సాయపడుతూ వంటగది లోనే కూర్చున్నాడు. ఉపాహారం తీసుకున్నాక "అలా బయటికి వెళ్దామటండీ శేఖరంగారూ!" అన్నాడు. ఆ వీధీ, ఈ వీధీ తిప్పి ఆఖరుకతడొక సినిమా థియేటరువైపు దారి తీసేసరికి నేను దిక్కుముఖం పెట్టేశాను." మరైతే మీకు సినిమాలంటే యిష్టం గదండీ శేఖరంగారూ! నేనూరికే మీకు కంపెనీ వుండడం కోసం వస్తున్నాను" అన్నాడు.

మరునాడు నేనెందుకోసమైతే హైదరాబాదు వెళ్ళానో ఆ ఆఫీసు పని పూర్తయ్యింది.

మూడోనాటి సాయంకాలం అయిదు గంటల బస్సులో శంకరం నాకు సీటు రిజర్వు చేయించాడు. బస్సు స్టాండుకు వచ్చి సాగనంపేవాడే. డైరెక్టరుగారి వెంట మంత్రిగారి కాన్ఫరెన్సుకు వెళ్ళవలసి రావటంతో అందుకు వీల్లేక పోయింది.

మధ్యాహ్నం భోజనమైన తర్వాత వసారాలో వేసిన వాలు కుర్చీలో కూర్చు న్నాను.

కాసేపు పడుకుని లేవమని చెప్పింది రేవతి. అసలే నాది మొద్దు నిద్ర. సకాలంలో బస్‌స్టాండుకు చేరుకునే ఉద్దేశ్యంతో నిద్రా కార్యక్రమం రద్దు చేసు కున్నాను.

గడిచిన రెండు రోజులనుంచీ ఒక ప్రశ్న నా గొంతుకలో కొట్టుమిట్టాడి పోతుంది. దాన్ని బయట పెట్టడానికి యింతకంటే తగిన సమయం వుండదనిపిం చింది.

హాల్లోకి చూస్తూ "మీ మామగారు బాగున్నారటమ్మా?" అన్నాను.

"అయ్యో, ఆయన పోయి అయిదేళ్ళయింది గదండీ..."

అనుబంధంగా యింకొక ప్రశ్న ఏదో అడగదలుచుకుని వెనుదిరిగి చూసే సరికి ఆమె హాల్లో లేదు.

గంట మూడున్నర కావస్తోంది.

ఇంక లేచి, ముఖం కడుక్కుని ఆటో తెప్పించుకుని, దారిలో పళ్ళు, బిస్కట్లు లాంటి వేమైనా కొనుక్కొని...

కిర్రుమంటూ గేటు తెరుచుకుంది. పోస్ట్‌మేన్ లోపలికి వచ్చి సాయంకాలపు టపా నా చేతి కిచ్చి పోయాడు.

ఇతరుల వుత్తరాలను చదివేపాటి కుసంస్కారం నాకు లేదు. అయినా వుత్తరాల మధ్య కానవచ్చిన ఓ కాగితం ముక్క నా దృష్టిని ఆకర్షించింది. అది డబ్బు ముట్టినందుకు గుర్తుగా తిరిగి వచ్చే యం ఓ. రసీదు.

పంపిన మొత్తమెంతో చూసాను. ఇంత మొత్తం ఎవరికి పంపినట్టా అని వితర్కించుకుంటూ వుండగా క్రింది భాగాన తెలుగక్షరాలతో 'సరసమ్మ' అన్న

సంతకం కనిపించింది. ఎవరీ సరసమ్మ? చిరునామాలో వివరణ లభించింది. 'సరసమ్మ-లేట్ సత్తిరాజుగారి భార్య.

చివురించే అనుభవం ఎలా వుంటుందో మ్రోడుకు తెలియకపోవచ్చు.

కరిగి నీరై పారే అనుభవం ఎలా వుంటుందో రాతికి తెలియకపోవచ్చు.

నేను మనిషిని గనుక ఊహిస్తున్నాను. మ్రోడునైవుంటే ఆ క్షణాన చిగురించి వుండేవాణ్ని. రాయినైవుంటే ఆ క్షణాన కరిగి నీరై ప్రవహించి వుండేవాణ్ని.

ఎల్లలెరుగని మంచితనం కూడా ఒక బలహీనత కావచ్చు. కానీ దాని ఎదుట తలవంచి మ్రొక్కడం మినహాగా మరొక్క భావన కల్గడానికి ఆస్కారం లేదనిపిస్తుంది.

భగవంతుణ్ని ఎవరు చూసారు?

-'(యువ)' మాసపత్రిక, 1972